సాక్షి
నిజామాబాద్
మంగళవారం । 10 । డిసెంబర్ । 2024



ప్రజావాణికి 95 ఫిర్యాదులు
కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణికి 95 ఫిర్యాదులు అందాయి. అడిషనల్ కలెక్టర్ కిరణ్‌కుమార్ ఫిర్యాదులు స్వీకరించారు.
- 8లో ▸



వైఫై పునరుద్ధరించాలి
తెలంగాణ యూనివర్సిటీలో వైఫై పునరుద్ధరించాలని ఏబీవీపీ నాయకులు వీసీ యాదగిరిరావు చాంబర్‌ను ముట్టడించారు.
- 8లో ▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
36.2 /13.6
ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి మంచు కురుస్తుంది. చలి తీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

రూ. 3.5 కోట్ల మత్తు పదార్థాల దహనం



జక్రాన్‌పల్లి: జక్రాన్‌పల్లి మండలం పడకల్ గ్రామంలోని శ్రీ మెడికేర్ సర్వీసెస్‌లో సోమవారం సుమారు రూ. 3.5 కోట్ల విలువైన మత్తుపదార్థాలను ఎక్సైజ్ అధికారులు దహనం చేశారు. జిల్లా డీసీ ఆదేశాల మేరకు నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ స్టేషన్‌ల పరిధిలోని 60 కేసులలో పట్టుబడిన వివిధ రకాల మత్తుపదార్థాలను దహనం చేశారు. 1007.02 కిలోల ఎండు గంజాయి, 35 కిలోల గంజాయి చాక్లెట్లు, 7 కిలోల డైజోపామ్, 8 కిలోల ఆల్ప్రాజోలం, రెండు గంజాయి మొక్కలను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్, బోధన్, ఆర్మూర్ ఎస్‌హెచ్‌వోలు పాల్గొన్నారు.

ఆర్టీసీ బంపర్ ఆఫర్



ఖలీల్‌వాడి: ఆర్టీసీ ఏసీ బస్సుల్లో బేసిక్ టికెట్ చార్జీపై 10 శాతం రాయితీ ఉన్నట్లు ఆర్టీసీ ఆర్‌ఎం జ్యోత్స్న సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏసీ స్లీపర్, ఏసీ సీటర్‌తోపాటు రాజధాని బస్సులకు రాయితీ వర్తిస్తుందని పేర్కొన్నారు. ప్రయాణికులకు ఉన్నతశ్రేణి ప్రయాణాన్ని మరింత అందుబాటులో ఉంచడమే లక్ష్యంగా ఈ ఆఫర్ ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ఆర్టీసీ పరిధిలోని అన్ని ఏసీ బస్సుల్లో తగ్గింపు ఉంటుందని, www. tgsrtconline. in ద్వారా లేదా సమీప బస్సు రిజర్వేషన్ కౌంటర్‌లో టికెట్ బుక్ చేసుకునే సౌకర్యం ఉన్నట్లు పేర్కొన్నారు.

బాపూజీ వచనాలయం నూతన కమిటీ ఎన్నిక



నిజామాబాద్‌అర్బన్: నగరంలోని బాపూజీ వచనాలయం నూతన కమిటీ ఎన్నికలు ఇటీవల జరుగగా సోమవారం ఫలితాలు వెలువడ్డాయి. అధ్యక్షుడిగా భిక్షవత్సలం, ఉపాధ్యక్షుడిగా దేవిదాస్, అశోక్, కార్యదర్శిగా సుధాకర్‌రావు, కోశాధికారిగా గంగాధర్‌రావు, సంయుక్త కార్యదర్శులుగా సాంబయ్య, దత్తాద్రి, కార్యవర్గ సభ్యులుగా లక్ష్మంరెడ్డి, జగన్, అమంద్‌విజయ్, హన్మండ్లు, లక్ష్మీనారాయణ, సంపత్, మహిపాల్‌రెడ్డి, అనిల్‌రెడ్డి, ప్రతాప్, గోవింద్, మోహన్‌రావు ఎన్నికయ్యారు.

పర్యావరణ కాలుష్యాన్ని నియంత్రించాలి

- డీఎంహెచ్‌వో డాక్టర్ రాజశ్రీ



నిజామాబాద్‌నాగారం: పర్యావరణ కాలుష్యాన్ని నియంత్రించడం ద్వారా అనేక రకాల శ్వాసకోశ వ్యాధులే కాకుండా క్యాన్సర్‌ను సైతం నివారించవచ్చని జిల్లా వైద్యాధికారి డాక్టర్ రాజశ్రీ అన్నారు. సోమవారం జాతీయ కాలుష్య నియంత్రణ వారోత్సవాల ముగింపు సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో డాక్టర్ రాజశ్రీ అధికారుల చేత పర్యావరణ పరిరక్షణపై ప్రతిజ్ఞ చేయించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరు పర్యావరణ కాలుష్య నివారణ చర్యలు చేపట్టాలన్నారు. మొక్కలను నాటడం ద్వారా చెట్లుగా పెరిగి వాటి నుంచి విడుదలయ్యే ఆక్సిజన్‌తో ప్రజల ఆయుష్షు పెరుగుతుందన్నారు. ప్రజలు లైట్లు ఆఫ్ చేయడం ద్వారా విద్యుత్ ఆదా చేయాలన్నారు. కాలుష్యాన్ని కలిగించే వాహనాలను ఉపయోగించడం తగ్గించి, విద్యుత్ వాహనాల వినియోగం పెంచాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కీటక జనిత వ్యాధుల నియంత్రణ అధికారి డాక్టర్ తుకారం రాథోడ్, అసంక్రమిత వ్యాధుల నియంత్రణ అధికారి డాక్టర్ వినీత్ రెడ్డి, జిల్లా ఆరోగ్య విద్య బోధకులు ఘన్పూర్ వెంకటేశ్వర్లు, ఎన్సీడీ కోఆర్డినేటర్ వెంకటేశం, ఏఎంఓ సలీం, డీపీహెచ్‌ఎన్‌వో స్వామి సులోచన వివిధ పీహెచ్‌సీల అధికారులు పాల్గొన్నారు.



వరద గేట్ల మరమ్మతులు చేపడుతున్న కూలీలు

ప్రాజెక్టు పనుల వేగం పెరిగేనా..!



ఎస్కేప్ గేట్ల ద్వారా లీకవుతున్న నీరు

- రెండున్నరేళ్లుగా సాగుతున్న ఎస్సారెస్పీ వరద గేట్ల మరమ్మతులు
- ఇప్పటి వరకు 32 గేట్ల పనులు పూర్తి. మిగిలిన మరో 10 గేట్లు

బాల్కొండ: శ్రీ రాంసాగర్ ప్రాజెక్ట్ వరద గేట్ల మరమ్మతు పనులు ఏళ్ల తరబడి సాగుతున్నాయి. రెండున్నర సంవత్సరాలు అయినా ఇప్పటి వరకు కొలిక్కి కాలేదు. 2022లో అప్పటి ప్రభుత్వం 42 వరద గేట్ల మరమ్మతుల కోసం రూ. 17.5 కోట్లు మంజూరు చేసింది. అదే ఏడాది మే నెలలో పనులు ప్రారంభించారు. ప్రాజెక్ట్ నిర్మాణ కాలం నుంచి పూర్తి స్థాయిలో వరద గేట్ల మరమ్మతులు చేపట్ట లేదు. ఈ క్రమంలో వరద గేట్లు గత మూడేళ్ల క్రితం మొరాయించాయి. దీంతో స్పందించి ప్రభుత్వం పూర్తి స్థాయిలో మరమ్మతుల కోసం నిధులు మంజూరు చేసింది. అయితే పనులు వేగంగా జరగడం లేదు.

మరో ఏడాది కాలం..

రెండున్నరేళ్ల కాలంలో ప్రాజెక్ట్ 42 వరద గేట్లలో 32 వరద గేట్ల మరమ్మతులు పూర్తయ్యాయి. ఈ లెక్కన చూస్తే మరో పది గేట్ల మరమ్మతులు పూర్తి కావడానికి మరో ఏడాది కాలం పట్టేలా ఉంది. ప్రస్తుతం ఎగువ ప్రాంతాల నుంచి వరదలు లేక పోవడంతో ప్రాజెక్ట్‌నీరు నిలకడగా ఉంటుంది. పనులు చేపట్టడానికి ఎలాంటి ఇబ్బంది లేదు. కాలువల ద్వారా యాసంగి సీజన్‌కు నీటి విడుదల చేపడితే ప్రాజెక్ట్ నీటి మట్టం తగ్గుతుంది. దీతో పనులు చేపట్టడానికి మరింత అనువుగా ఉంటుంది. ప్రస్తుతం స్టాప్ లాక్ గేట్లను వేసి మరమ్మతులు చేపడుతున్నారు. వచ్చే ఖరీఫ్ సీజన్ నాటికి మరమ్మతులు పూర్తి చేయాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు. వేసవిలో నీటి మట్టం పూర్తిగా తగ్గుతుంది. దీంతో పనులు చేపట్టే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ఏప్రిల్, మే, జూన్ నెలల్లో పనులు వేగవంతం చేసి పనులు పూర్తి చేయాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

భద్రత లేకుండా పనులు..

వరద గేట్ల మరమ్మతు పనులను కార్మికులు ఎలాంటి భద్రత లేకుండా చేపడుతున్నారు. వారికి కనీసం సేఫ్టీ బెల్ట్ కూడ లేదు. గతంలో వరద గేట్ల పెయింటింగ్ పనులు చేపడుతూ కార్మికులు ప్రమాదానికి గురైనా అధికారులు తగిన భద్రత చర్యలు తీసుకోవడంలో స్పందించడం లేదు.

వచ్చే ఖరీఫ్ నాటికి పూర్తయ్యేలా..

వరద గేట్ల మరమ్మతుల పనులను వేగవంతం చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించాం. వచ్చే ఖరీఫ్ ప్రారంభం నాటికి పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం. భద్రత విషయంలో చర్యలు తీసుకుంటాం. – చక్రపాణి, ఈఈ, ఎస్సారెస్పీ

ప్రతి నీటి బొట్టు అవసరమే..

ప్రస్తుతం ప్రాజెక్ట్ నీటి నిల్వ సామర్థ్యం 90 టీఎంసీల నుంచి 80.5 టీఎంసీలకు పడిపోయింది. అంటే 9.5 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం తగ్గింది. కాని ఆయకట్టు మాత్రం తగ్గలేదు. అందువల్ల చివరి వరకు ఆయకట్టుకు యాసంగిలో నీరు అందించాలంటే ప్రతి నీటి బొట్టు అవసరం ఎంతో ఉంది. చుక్క నీరే కదాని నిర్లక్ష్యం చేస్తే చివరి ఆయకట్టుకు నీరు అందక ఎండిపోయే ప్రమాదం ఉంది. ఉన్నత అధికారులు స్పందించి ప్రతి నీటి చుక్కను కాపాడేల చర్యలు తీసుకోవాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

ఎస్సారెస్పీ నీరు గంగ పాలు

- ప్రాజెక్టు వరద గేట్లు, ఎస్కేప్ గేట్ల ద్వారా లీకవుతున్న నీరు
- పట్టించుకోని అధికారులు.. నిరసన వ్యక్తం చేస్తున్న ఆయకట్టు రైతులు

బాల్కొండ: శ్రీ రాంసాగర్ ప్రాజెక్ట్ నీటి నిల్వ సామర్థ్యం తగ్గడంతో సాగు నీటి కోసం ఆయకట్టు రైతులు అనేక పాట్లు పడే పరిస్థితి ఎదురైంది. ప్రస్తుతం ప్రాజెక్ట్‌లో నీరు నిండుగా ఉంది. అయినా చివరి ఆయకట్టుకు నీరు అందడం గగనంగానే ఉంది. ఈ సమయంలో కూడ ప్రాజెక్ట్ నీరు లీకేజీల రూపంలో గంగ (గోదావరి) పాలవుతోంది. అధికారులు చర్యలు చేపట్టడం లేదు. ప్రాజెక్ట్ నుంచి మిగులు జలాలను వదులుటకు నిర్మించిన వరద గేట్ల ద్వారా నీరు లీకేజీ అవుతోంది. ప్రాజెక్టుకు వరదలు వచ్చినప్పుడు, కాకతీయ కాలువ ద్వారా నీటి విడుదల అవసరం లేని సమయంలో విద్యుదుత్పత్తి అనంతరం నీటిని గోదావరిలోకి మళ్లించుటకు నిర్మించిన ఎస్కేప్ గేట్ల ద్వారా నీరు లీకవుతోంది. రైతులకు ప్రాజెక్ట్ అధికారులు ప్రతి నీటి చుక్కను సద్వి నియోగం చేసుకోవాలని సూచిస్తారు. అధికారులు మాత్రం ఆచరించడం లేదు. ప్రాజెక్ట్ నుంచి నీరు లీకేజీ రూపంలో పోతున్న ఎలాంటి చర్యలు చేపట్టలేదు. వరద గేట్లు ప్రాజెక్ట్ అధికారుల ఆధీనంలో ఉన్నాయి. ఎస్కేప్ గేట్లు జెన్‌కో అధికారుల ఆధీనంలో ఉన్నాయి. ప్రాజెక్ట్, జెన్‌కో అధికారుల నిర్లక్ష్యం మూలంగా నీరు వృథాగా పోతోంది. ఐదు ఎస్కేప్ గేట్లలోని ఒక గేటు నుంచి నీరు ఎక్కువగా లీకవుతోంది. వరద గేట్లు 42 ఉన్నాయి. అందులో నాలుగు గేట్ల ద్వారా నీరు లీకవుతోంది. అందులో రెండు గేట్ల ద్వారా అధికంగా నీరు లీకవుతుంది.



వరద గేట్ల ద్వారా లీకవుతున్న నీరు

సోనియా వల్లే ప్రత్యేక తెలంగాణ

నిజామాబాద్ సిటీ: అరవై ఏళ్ల తెలంగాణ ప్రజల ఆకాంక్షను గుర్తించి, విద్యార్థుల త్యాగాలకు చలించి సోనియా గాంధీ తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఇచ్చారని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ భవన్‌లో నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కేశ వేణు, గ్రంథాలయ చైర్మన్ రాజిరెడ్డితో కలిసి సోనియా జన్మదిన వేడుకలు నిర్వహించారు. యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు రక్తదానం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బాడ్సి శేఖర్ గౌడ్, జావిద్ అక్రమ్, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు విపుల్ గౌడ్, బొబ్బిలి రామకృష్ణ, బొర్గాం శ్రీనివాస్, సంతోష్ , రేవతి, ఆకుల సుజాత, మలైకా బేగం, అపర్ణ తదితరులు పాల్గొన్నారు.



బర్త్‌డే కేక్‌కట్ చేస్తున్న మానాల తదితరులు

బలిదేవత తెలంగాణ తల్లి ఎట్లయిందో !

- సోనియా గాంధీ జన్మదినం రోజున తెలంగాణ తల్లి ఉత్సవాలా ?
- నిరసన వ్యక్తం చేసిన ఎమ్మెల్యే ధన్‌పాల్

నిజామాబాద్ సిటీ : కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ జన్మదినం రోజున తెలంగాణ తల్లి ఉత్సవాలు జరపడాన్ని బీజేపీ పార్టీ వ్యతిరేకిస్తున్నదని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా అన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డి టీడీపీ నాయకుడిగా ఉన్నప్పుడు ఇదే సోనియా గాంధీని తెలంగాణ బలిదేవత అన్నాడని, నేడు తెలంగాణ దేవతగా అభివర్ణించడం కేవలం ఆమె మెప్పుకోసమేనని విమర్శించారు. సోనియాగాంధీ జన్మదినం రోజున తెలంగాణ తల్లి ఉత్సవాలు జరపడంపై మండిపడ్డారు. తెలంగాణ కోసం అసువులు బాసిన అమరవీరుల ఆత్మలు గోషిస్తాయని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ విగ్రహం మార్పులో తెలంగాణ అస్తిత్వం, తెలంగాణకు ప్రతీక అయినా బతుకమ్మ పెట్టకపోవడం తెలంగాణను అవమానించినట్లేనని అన్నారు. ఢిల్లీ కాంగ్రెస్ పెద్దలను జోకడంలోనే వాళ్ల విలువైన సంవత్సర కాలం గడిచిపోయిందన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన గ్యారంటీలు, హామీలు ఎగవేయడానికే సరే, ఉత్సవాల పేరుతో కాలయాపన చేస్తున్నారన్నారు. గ్యారంటీల అమలుకు అసెంబ్లీలో తీర్మానం చేయాలన్నారు.



మాట్లాడుతున్న అర్బన్ ఎమ్మెల్యే

ఇందిరమ్మ ఇళ్ల సర్వేకు బ్రేక్

- తమతో కాదని తేల్చి చెప్పిన పంచాయతీ కార్యదర్శులు
- ఎంపీడీవోలు, డీపీవో, జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రాల సమర్పణ



భీమ్‌గల్ ఎంపీడీవోకు వినతిపత్రం అందిస్తున్న పంచాయతీ కార్యదర్శులు

మోర్తాడ్(బాల్కొండ): ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పథకం లబ్ధిదారుల ఎంపిక కోసం నిర్వహించే సర్వే బాధ్యతల నుంచి తమను తప్పించాలని పంచాయతీ కార్యదర్శులు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. సోమవారం జిల్లా వ్యాప్తంగా ఎంపీడీవోలు, డీపీవో, జిల్లా కలెక్టర్‌కు సర్వేను తాము నిర్వహించలేమని స్పష్టం చేస్తూ వినతి పత్రాలను అందించారు. పంచాయతీ కార్యదర్శులు సర్వే చేయబోమని వెల్లడించడంతో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక సర్వేకు బ్రేక్ పడినట్లు అయ్యింది. ఒక్కో నియోజకవర్గానికి తొలి విడతలో 3,500 చొప్పున ఇండ్లను నిర్మించడానికి సాయం అందించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. లబ్ధిదారుల ఎంపిక కోసం పంచాయతీ కార్యదర్శుల మొబైల్ ఫోన్‌లలో ప్రత్యేక యాప్‌ను డౌన్‌లోడ్ చేయించారు. యూజర్ ఐడీ, పాస్‌వర్డ్ సైతం ఇచ్చి ఒక రోజు శిక్షణ ఇచ్చారు. ఒక్కో పంచాయతీలో ఇందిరమ్మ ఇండ్ల సాయం కోసం అందిన దరఖాస్తుల సంఖ్య 100 నుంచి వెయ్యి వరకు ఉన్నాయి. ప్రతి దరఖాస్తుదారుని ఇంటికి వెళ్లి యాప్‌లో వివరాలను నమోదు చేయాల్సి ఉంది. అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన యాప్ కావడంతో సర్వే నిర్వహణ ఇష్టారీతిన నిర్వహించడం జరుగదు. తమకు ఉన్న పని భారం వల్ల ఇందిరమ్మ ఇళ్ల సర్వే భారం మోయలేమని కార్యదర్శులు తేల్చారు.

ఒత్తిడి ఉంటుందని..


ఇందిరమ్మ ఇంటి నిర్మాణం కోసం సాయం అందుకోవడానికి లబ్ధిదారుల ఎంపికను ప్రభుత్వం పక్కాగా చేపట్టాలని నిర్ణయించింది. మొబైల్ యాప్ ద్వారా సర్వే చేయడం, ప్రభుత్వ నిబంధనలు కఠినంగా ఉండటంతో ఎవరికైనా సాయం అందకపోతే కార్యదర్శులపై ఒత్తిడి పెరిగే అవకాశం ఉంది. తాము పని చేసే చోట సర్వే నిర్వహించడం వల్ల ఎన్నో రకాల ఇబ్బందికరమైన పరిస్థితులు ఎదురవుతాయనే ఉద్దేశంతో కార్యదర్శులు సర్వే విధుల నుంచి తప్పించాలని కోరుతున్నారు. వేరే శాఖల ఉద్యోగులకు సర్వే బాధ్యతలను అప్పగిస్తే తాము సహకరిస్తామని కార్యదర్శులు వెల్లడిస్తున్నారు. లేదా యాప్ ద్వారా కాకుండా రాతప్రతుల ద్వారా సర్వే నిర్వహించడానికి కొంత మంది కార్యదర్శులు మొగ్గు చూపుతున్నారు. లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా చేపట్టాలని ప్రభుత్వం ప్రత్యేక సాఫ్ట్‌వేర్ ద్వారా యాప్‌ను రూపొందించింది. అర్హులు కాని వారితో కార్యదర్శులకు ఘర్షణ పరిస్థితులు తలెత్తే అవకాశం ఉంది. ఇలా ఎన్నో కారణాలతో సర్వే బాధ్యతలు తాము నిర్వహించబోమని కార్యదర్శులు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

ప్రభుత్వం సహృదయంతో ఆలోచించాలి

ఇందిరమ్మ ఇంటి సాయం లబ్ధిదారుల ఎంపిక కోసం నిర్వహించే సర్వే విషయంలో కార్యదర్శులపై భారం మోపవద్దు. గ్రామాల్లో కార్యదర్శులుగా విధులు నిర్వహిస్తూనే లబ్ధిదారుల ఎంపిక నిర్వహించడం కష్టం అవుతుంది. ప్రభుత్వం సహృదయంతో ఆలోచన చేయాలి. – విజయ్, పంచాయతీ కార్యదర్శుల సంఘం జిల్లా అధ్యక్షుడు

ప్రయోజనం లేని ఫీజు రాయితీ!

- పదో తరగతి విద్యార్థుల నిరసన
- దశాబ్దాల నాటి నిబంధనలు మార్చాలని డిమాండ్



నిజామాబాద్‌అర్బన్: రెండు దశాబ్దాలుగా రాష్ట్ర విద్యాశాఖ అమలు చేస్తున్న పదో తరగతి పరీక్ష ఫీజు రాయితీ పథకంతో విద్యార్థులకు ప్రయోజనం లేకుండా పోయింది. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా ఈ పథకం నిబంధనలు మార్చక పోవడమే ఇందుకు కారణం. ప్రతి ఏడాది లాగే ప్రభుత్వం గత నవంబర్ 8న పదో తరగతి పరీక్ష ఫీజు ఉత్తర్వులు జారీ చేసింది. నిబంధనల ప్రకారం పదో తరగతి విద్యార్థి పరీక్ష ఫీజు రూ. 125 చెల్లించాలి. పరీక్ష ఫీజులో రాయితీ పొందాలంటే బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు కుటుంబ వార్షిక ఆదాయ ధ్రువ పత్రం సమర్పించాల్సి ఉంటుంది. పట్టణ ప్రాంతాల వారికి రూ. 24 వేలు, గ్రామీణ ప్రాంతాల వారికి రూ. 20 వేలు మాత్రమే వార్షిక ఆదాయం ఉండాలని నిబంధన ఉంది. అంటే కుటుంబం నెలసరి ఆదాయం రూ. 2 వేల లోపు ఉండాలి. ఇంత తక్కువ ఆదాయం ఏ కుటుంబానికి ఉండదు. ఇదిలా ఉండగా ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధి పొందాలంటే గ్రామీణ ప్రాంతాల్లో కుటుంబ వార్షిక ఆదాయం రూ. 1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.2 లక్షల వార్షిక ఆదాయం ఉండాలని ప్రభుత్వ ఉత్తర్వులు చెబుతున్నాయి. పైగా ఇప్పుడు తహసీల్ కార్యాలయాల్లో రూ. లక్ష లోపు ఆదాయ ధ్రువ పత్రాలు ఇవ్వడం లేదు. కనీసం దీని ప్రకారమైనా పదో తరగతి ఫీజు రాయితీ నిబంధన మార్చకపోవడంతో విద్యార్థులు ప్రయోజనం పొందలేక పోతున్నారు. దీంతో నిరసన వ్యక్తం అవుతోంది. రెండు దశాబ్దాలుగా అమలు చేస్తున్న ఫీజు రాయితీ పథకంలో ఇప్పటి పరిస్థితులకు అనుగుణంగా నిబంధనలు మార్చాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, దుస్తులు, మధ్యాహ్న భోజనం అందిస్తున్నారు.అలాగే పదో తరగతి పరీక్ష ఫీజు కూడా ప్రభుత్వమే భరిస్తే బాగుంటుంది. ఆ దిశగా ప్రభుత్వం ఆలోచన చేసి పదో తరగతి విద్యార్థుల పరీక్ష ఫీజును మాఫీ చేయాలని పలువురు కోరుతున్నారు.

ఇబ్బందులు రాకుండా చూడాలి



ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పదో తరగతి విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగానే పరీక్షలు రాయించాలి. పరీక్ష ఫీ జులు మినహాయించాలి. ప్రస్తుతం ఉన్న నిబంధనలను పున: సమీక్ష చేయాలి. విద్యార్థులకు ఇబ్బందులు రాకుండా చూడాలి.
– కిషన్, పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి

నిబంధనలు అమలు చేస్తున్నాం



పదో తరగతి పక్ష ఫీజు ప్రక్రియలో ప్రభుత్వ నిబంధనలను అమలు చేస్తున్నాం. పదో తరగతి పరీక్ష ఫీజు రాయితీ తేదీలు పక్కగా అమలు చేస్తున్నాం . వీటిపై ఇబ్బందులు ఉంటే ఉన్నతాధికారులు పరిశీలన చేస్తారు.
– అశోక్, జిల్లా విద్యాశాఖ అధికారి

బతుకు బండి సాగాలని..



బతుకు బండి సాగాలని ఓ చిన్నారి ఇలా సాహస ప్రదర్శన చేస్తోంది. నిజామాబాద్ నగరంలోని మార్కండేయ మందిరం వద్ద ఏర్పాటు చేసిన ప్రదర్శనలో చిన్నారి ఇలా తలపై బిందె, చేతిలో పెద్ద కర్ర పట్టుకొని తాడుపై నడవడం అందరినీ ఆకట్టుకుంది. ప్రదర్శనను తిలకించిన వారు తోచిన సాయం చేసి వెళ్లిపోయారు.
– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

11 నుంచి అథ్లెటిక్స్, వాలీబాల్ పోటీలు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని ఇంటర్ కాలేజ్ అథ్లెటిక్స్ (పురుషులు/ మహిళలు) చాంపియన్ షిప్ పోటీలతోపాటు వాలీబాల్ (పురుషులు / మహిళ లు) టోర్నమెంట్‌ను నిర్వహించనున్నట్లు వర్సిటీ స్పోర్ట్స్ డైరెక్టర్ జి బాలకిషన్ సోమ వారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 11న అథ్లెటిక్స్, 12న వాలీబాల్ పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనేందుకు వర్సిటీ పరిధిలోని అన్ని అ నుబంధ డిగ్రీ, పీజీ కళాశాలల్లో చదువుతు న్న విద్యార్థులు అర్హులని తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులను సంబంధిత కళాశాలల ఫిజికల్ డైరెక్టర్లు ప్రోత్సహించి పోటీల్లో పాల్గొనేందుకు తీసుకురావాలని డైరెక్టర్‌తో పాటు ఆర్గనైజింగ్ సెక్రెటరీ బీఆర్ నేత కోరారు.

క్లుప్తంగా

ఉద్యోగం పేరిట డబ్బులు వసూలు



నిజామాబాద్‌అర్బన్: వైద్యారోగ్యశాఖలో ఉద్యోగం ఇప్పిస్తానని ఓ వ్యక్తి తనను మోసం చేశాడని నగరంలోని ముజాహిద్‌నగర్‌కు చెందిన రజియా సుల్తానా అనే మహిళ సోమవారం ప్రజావాణిలో అధికారులకు ఫిర్యాదు చేశారు. నర్సింగ్ కోర్సు పూర్తి చేసిన తాను ఉద్యోగం కోసం ప్రయత్నిస్తున్నానని, ఓ వ్యక్తి ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి రూ.లక్షా 50వేలు అడిగాడని తెలిపింది. తాను సదరు వ్యక్తికి రూ.40వేలు ఫోన్ పే చేసిన తరువాత ఆయన కనిపించకుండాపోయాడని ఆవేదన వ్యక్తం చేసింది.

పోగొట్టుకున్న ఫోన్‌ల అందజేత

ఖలీల్‌వాడి: వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో పలువురు గతంలో ఫోన్లు పోగొట్టుకోగా, పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు విచారణ చేపట్టిన పోలీసు సిబ్బంది 8ఫోన్లను రికవరీ చేశారు. నగరంలోని సీపీ కార్యాలయంలో సోమవారం బాధితులకు ఫోన్లను డీసీపీ (అడ్మిన్) బస్వారెడ్డి అందజేశారు. సీఐఈఆర్ ఆపరేటర్ సుష్మను డీసీపీ అభినందించారు.

సైన్స్ ఫెయిర్‌లో చిన్నమల్లారెడ్డి విద్యార్థుల ప్రతిభ



కామారెడ్డి రూరల్: బాన్సువాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ నెల 6,7వ తేదీల్లో జరిగిన విద్యా వైజ్ఞానిక ప్రదర్శన(సైన్స్ ఫెయిర్), ఇన్‌స్పైర్ ప్రదర్శనలో ఫుడ్ హెల్త్ అండ్ హైజీన్‌కు సంబంధించి జూనియర్ విభాగంలో కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డి బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు సాయి చరణ్, నందీశ్వర్లు ప్రదర్శించిన టీచర్ స్టూడెంట్ ఫ్రెండ్లీ డస్టర్ అనే అంశం జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయికి ఎంపికైంది. అలాగే రిసోర్స్ మేనేజ్మెంట్ విభాగంలో సీనియర్స్ నుంచి నివేదిత, నిఖిల ప్రదర్శించిన పర్యావరణ కాలుష్యంపై అంశం జిల్లా స్థాయిలో మొదటి స్థానాన్ని పొంది రాష్ట్ర స్థాయికి ఎంపికైంది. అయితే వీరికి గైడ్ టీచర్‌గా పాఠశాల భౌతిక రసాయన శాస్త్ర ఉపాధ్యాయుడు ప్రవీణ్ కుమార్ వ్యవహరించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రధాన ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందించారు.

'ఇందిరమ్మ ఇళ్ల' సర్వే చేయలేం



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): గ్రామాల్లో తాము ఇందిరమ్మ ఇళ్ల సర్వే చేయలేమని పేర్కొంటూ నాగిరెడ్డిపేట మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులు సోమవారం స్థానిక ఎంపీడీవో ప్రభాకరచారికి వినతిపత్రాన్ని అందజేశారు. గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల సర్వే చేయడం వల్ల భవిష్యత్తులో ఉద్యోగపరంగా తాము ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని వారు చెప్పారు. సర్వేలో భాగంగా ప్రవేశపెట్టిన యాప్‌లో రిజెక్ట్, ఎలిజిబుల్ అనే ఆప్షన్ ఉందని, దీనివల్ల తాము ఎవరినైనా రిజెక్ట్ చేస్తే తమపై భౌతికదాడులకు పాల్పడే అవకాశముందన్నారు. గ్రామాల్లో ప్రత్యేక అధికారులను నియమించి వారితో సర్వే జరిపించాలని, వారికి తాము సహకరిస్తామని చెప్పారు.

ప్రజావాణికి 95 ఫిర్యాదులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఉన్నతాధికారులు

నిజామాబాద్ అర్బన్: ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 95 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను అదనపు కలెక్టర్‌తోపాటు డీఆర్డీవో సాయాగౌడ్, ఆర్డీవో రాజేంద్రకుమార్, ఇన్‌చార్జి డీపీవో శ్రీనివాస్, బోధన్ ఏసీపీ శ్రీనివాస్, మెప్మా పీడీ రాజేందర్‌కు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బాపూజీ వచనాలయం ఎన్నికలు ఆపండి



ఫిర్యాదు అందజేస్తున్న కోనేరు సాయికుమార్

బాపూజీ వచనాలయం ఎన్నికలను నిలిపివేయాలని కోరుతూ నగరానికి చెందిన సాయికుమార్ అనే వ్యక్తి ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఒకే ఇంట్లో అధిక ఓట్లను నమోదు చేసుకొని ఎన్నికలు నిర్వహిస్తున్నారని, దీనిపై హైకోర్టుకు వెళ్లగా, వివరణ కోసం నాలుగు వారాలపాటు ఎన్నిక ప్రక్రియను నిలిపివేయాలని న్యాయస్థానం ఆదేశించిందన్నారు. అయినప్పటికీ ఎన్నికలు నిర్వహించారన్నారు.

విద్యార్థి మృతిపై విచారణ చేపట్టాలి

నగరంలోని కాకతీయ పాఠశాలలో ఇటీవల విద్యార్థి మృతి చెందిన ఘటనపై సీబీసీఐడీతో విచారణ చేయించాలని టీజీవీపీ నాయకులు ఫిర్యాదు చేశారు. యాజమాన్యాన్ని విచారించాలన్నారు.

ఐటీఐలకు నిధులు కేటాయించాలి

ప్రభుత్వ ఐటీఐలకు నిధులు కేటాయించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ ఐటీఐలలో కనీస సౌకర్యాలు అందుబాటులో లేవన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో విఘ్నేష్, దినేశ్ తదితరులున్నారు.

వైఫై సౌకర్యాన్ని పునరుద్ధరించాలి



ఏబీవీపీ నాయకులతో మాట్లాడుతున్న తెయూ వీసీ యాదగిరిరావు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ క్యాంపస్‌లోని బాలబాలికల హాస్టళ్లు, ఆయా కళాశాలల భవనాల్లో గత వారం రోజులుగా వైఫై రావడం లేదని ఏబీవీపీ నాయకులు ఆరోపించారు. వెంటనే క్యాంపస్ లో వైఫై సౌకర్యాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ ఆధ్వర్యంలో విద్యార్థులు వీసీ చాంబర్‌ను సోమవారం ముట్టడించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా తెయూ ఏబీవీపీ కార్యదర్శి అమృత్‌చారి మాట్లాడుతూ.. వైఫై రాకపోవడంతో విద్యార్థులు ఆన్‌లైన్ క్లాసులు వినలేకపోతున్నారని, పోటీపరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఆందోళన చేస్తున్న విద్యార్థుల వద్దకు వీసీ యాదగిరిరావు, రిజిస్ట్రార్ యాదగిరి వచ్చి సమస్యలను విన్నారు. మూడు రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో విద్యార్థులు శాంతించి ధర్నా విరమించారు. తెయూ ఏబీవీపీ సంయుక్త కార్యదర్శి సమీర్, ఎస్ఎఫ్‌డీ కో కన్వీనర్ మోహన్, నాయకులు నవీన్, అక్షయ్, శ్రీను, అజయ్, అశోక్, సుమిత్, మధు, రోహన్, అజయ్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

యేసు బోధనలను పాటించాలి



బోధన్‌టౌన్(బోధన్): మానవాళి బాధలను దూరం చేసేందుకు మానవ రూపంలో క్రీస్తు జన్మించాడని, ఆయన సూచించిన బోధనలు పాటించాలని మెదక్ బిషప్ రూబెన్ మార్క్ అన్నారు. బోధన్ పట్టణంలోని ఆచన్‌పల్లి సీఎస్ఐ చర్చి ఆవరణలో పార్కింగ్, డైనింగ్ హాల్ షెడ్డులను సోమవారం ఆయన ప్రారంభించారు. దమ్మల జ్యోతిరాజ్ సమకూర్చిన దుప్పట్లను మున్సిపల్ సానిటేషన్ సిబ్బందికి అందజేశారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ రెవరెండ్ విష్టన్, హాస్టల్ బోర్డు కన్వీనర్ రెవరెండ్ భాస్కర్, డీసీసీ డెలిగేట్ గంగాశంకర్, జీడీసీసీ చైర్మన్ రెవరెండ్ సామ్యూల్, పాస్టర్లు ప్రభాకర్, స్టీఫెన్, రూబెన్, పాస్టరేట్ కోశాధికారి పుష్పరాజ్, సెక్రెటరీ ఎడ్వర్డ్ ముల్లర్, సందీప్, ప్రతినిధులు కిశోర్‌కుమార్, దాస్ తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా 'పచ్చబొట్టు' ఆవిష్కరణ



నిజామాబాద్ రూరల్: జిల్లాకు చెందిన కవులు డాక్టర్ నాళేశ్వరం శంకరం, ఘనపురం దేవేందర్, జి నరసింహస్వామి, తిరుమల శ్రీనివాస్ ఆర్య, నరాల సుధాకర్ కలిసి రూపొందించిన 'పచ్చబొట్టు' కవితా సంకలనాన్ని తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి అధ్యక్షుడు, ప్రఖ్యాత కవి డాక్టర్ నందిని సిధారెడ్డి ఆవిష్కరించారు. ఆదివారం రాత్రి హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించిన తెలంగాణ రచయితల సంఘం పదేండ్ల సాహిత్య సభలో ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నందిని సిద్ధారెడ్డి మాట్లాడుతూ.. నిజామాబాద్ జిల్లాలో బలమైన సాహిత్య వాతావరణం ఉందని అభినందించారు. నిజామాబాద్ కవులు రూపొందించిన పచ్చబొట్టు కవితా సంకలనాన్ని స్ఫూర్తిగా తీసుకొని ఇతర జిల్లాలలో కూడా కవితా సంకలనాలను తీసుకురావాలని తెలంగాణ రచయితల సంఘం సభ్యులకు సూచించారు. తెలంగాణలో వస్తున్న చిక్కని చక్కని కవిత్వానికి 'పచ్చబొట్టు' కవితా సంకలనం నిదర్శనమని కొనియాడారు. జనగామ జిల్లా తెలంగాణ రచయితల సంఘం అధ్యక్షుడు బిల్లా మహేందర్ అధ్యక్షత వహించిన కార్యక్రమానికి నేటి నిజం సంపాదకులు బైస దేవీదాస్, తెలంగాణ రచయితల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ వి శంకర్, ఎం కవిత, జీడీ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

కోటగిరి పోలీస్‌స్టేషన్ తనిఖీ



రుద్రూర్: కోటగిరి పోలీస్‌స్టేషన్‌ను బోధన్ ఏసీపీ శ్రీనివాస్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి కేసులు, దర్యాప్తు వివరాలను తెలుసుకున్నారు. మహారాష్ట్ర సరిహద్దులో ఉన్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. నూతన కానిస్టేబుళ్లకు పలు సూచనలు చేశారు. ఆయనవెంట రుద్రూర్ సీఐ కృష్ణ, కోటగిరి ఎస్సై సందీప్ ఉన్నారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

- బైక్‌ను ఢీకొట్టిన కారు
- మూలమలుపులో హోటల్ ముందు వాహనాలు నిలవడంతో ఘటన
- హోటల్‌ను తొలగించాలని గ్రామస్తుల ధర్నా



మహ్మద్ ఆరిఫ్ (ఫైల్)



ధర్నా చేస్తున్న పొందుర్తి గ్రామస్తులు

రాజంపేట: మండలంలోని పొందుర్తి వద్ద జాతీయ రహదారి 44పై బైక్‌ను కారు ఢీకొట్టిన ఘటనలో ఒకరు మృతి చెందారు. ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి..పొందుర్తికి చెందిన మహ్మద్ ఆరిఫ్ (39) ఆదివారం రాత్రి బైక్‌పై వెళ్తుండగా హైవేపై ఎదురుగా వచ్చిన కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆరిఫ్ అక్కడికక్కడే మృతి చెందాడు. సోమవారం ఉదయం మృతుడి కుటుంబ సభ్యులతోపాటు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఎన్‌హెచ్ 44పై ధర్నా చేశారు. హైవేపై ఉన్న పెట్రోల్ పంప్‌ను అనుకుని పొందుర్తి మూలమలుపు వద్ద హోటల్ ఏర్పాటు చేయడంతో అక్కడ వాహనాలను నిలుపుతున్నారని, ఈ కారణంగా ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయమై పలుమార్లు హోటల్ యజమానిని హెచ్చరించినా ఫలితం లేకుండాపోయిందన్నారు. సమాచారం అందుకున్న ఎస్సై రాజు ఘటనాస్థలానికి చేరుకుని గ్రామస్తులను సముదాయించడంతో వారు ఆందోళన విరమించారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తానని ఎస్సై అన్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చిరుత దాడిలో దూడ మృతి



ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి మండలంలోని తిమ్మాపూర్ అటవీప్రాంతంలో దూడపై చిరుత దాడి చేసినట్లు స్థానికులు సోమవారం తెలిపారు. గ్రామంలోని నిమ్మ సత్యనారాయణకు చెందిన లేగ దూడను పొలంలో కట్టి వేశాడు. సోమవారం ఉదయం వెళ్లిన సమయంలో దూడ మృతి చెంది ఉంది. చిరుత దాడి చేయడంతో దూడ మృతి చెందిందని సత్యనారాయణ అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. ఘటనాస్థలానికి చేరుకున్న అటవీశాఖ అధికారులు చిరుతదాడేనని ధృవీకరించారు. చిరుతను బంధించేందుకు బోను ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు

ఖలీల్‌వాడి: నగరంలోని ఒకటో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని నిజామాబాద్ రైల్వే స్టేషన్ ప్రాంతంలో సోమవారం సాయంత్రం 6 గంటల సమయంలో గంజాయి అమ్ముతున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపారు. రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లో అనుమానాస్పదంగా తిరుగుతున్న మోపాల్ మండలం శ్రీరాంసాగర్ తండాకు చెందిన బామన్ జైల్‌సింగ్‌ను అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా బ్యాగులో సమారు 210 గ్రాముల గంజాయి పట్టుబడిందన్నారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

ప్రమాదవశాత్తు గుడిసె దగ్ధం



ధర్పల్లి: ప్రమాదవశాత్తు మంటలు చెలరేగి నివాసపు గుడిసె దగ్ధమైంది. ఈ ఘటన మండల కేంద్రంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. గోసంగి కాలనీకి చెందిన సంపంగి సాయవ్వ తన మనవరాళ్లతో కలిసి పూరిగుడిసెలో జీవిస్తోంది. ఆదివారం రాత్రి ప్రమాదవశాత్తు గుడిసెకు మంటలు అంటుకోవడంతో సాయవ్వ తన మనవరాళ్లతో కలిసి బయటికి పరుగు తీసి కేకలు వేసింది. స్థానికులు అప్రమత్తమై మంటలను ఆర్పివేసినప్పటికీ అప్పటికే అందులోని నగదు, సామగ్రి దగ్ధమైంది. తమను ప్రభుత్వమే ఆదుకోవాలని బాధితురాలు బోరున విలపించింది. ఘటన స్థలాన్ని ఆర్ఐ రాజేశ్వర్ పరిశీలించి పంచనామా నిర్వహించారు. సుమారు రూ.40వేల వరకు ఆస్తి నష్టం వాటిల్లిందని తెలిపారు. మాజీ ఎంపీపీ సారికాహనుమంత్‌రెడ్డి, రాజ్‌పాల్ రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు.

ఆవులను తరలిస్తున్న వ్యాన్ పట్టివేత

నందిపేట్(ఆర్మూర్): అక్రమంగా ఆవులను తరలిస్తున్న వ్యాన్‌ను పోలీసులు సోమవారం పట్టుకున్నారు. మండల కేంద్రంలోని చింరాజ్‌పల్లి గ్రామ కమాన్ వద్ద పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా వ్యాన్‌లో ఆవులు కనిపించాయి. డొంకేశ్వర్ మండల కేంద్రం నుంచి నవీపేట మండలం నీలా గ్రామానికి అక్రమంగా రెండు ఆవులు, రెండు గేదెల ను తరలిస్తున్నట్లు తెలుసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. బాధ్యులైన మహ్మద్ మక్బర్, ఎస్‌కే ఆదిత్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై హరిబాబు తెలిపారు.

పీడీఎస్ బియ్యం..

ఎడపల్లి (బోధన్): నిజామాబాద్ వైపు నుంచి బోధన్ మీదుగా మహారాష్ట్రకు అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై వంశీ చందర్‌రెడ్డి తెలిపారు. ఎడపల్లి శివారులో డీసీఎంను తనిఖీ చేయగా 74 సంచుల పీడీఎస్ బియ్యం పట్టుబడిందన్నారు. డీసీఎం డ్రైవర్ అబ్బాస్‌పై కేసు నమోదు చేశామన్నారు.

హోటళ్లు, దాబా నిర్వాహకులకు జైలు శిక్ష

బోధన్‌టౌన్(బోధన్): బోధన్ పట్టణ పరిధిలో సమయపాలన పాటించకుండా నడిపిస్తున్న పలు దాబాల, హోటళ్ల యజమానులను బోధన్ కోర్టులో సోమవారం హాజరుపర్చగా సెకండ్ క్లాస్ న్యాయమూర్తి శేషసాయి తల్ప వారికి రెండు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారని సీఐ వెంకటనారాయణ తెలిపారు. పట్టణ పరిధిలోని కిసాన్‌దాబా, చాందిని దాబా, స్ప్రింగ్ బేకరీ, అన్సార్ హోటల్ యజమానులు సమయపాలన లేకుండా రాత్రి వేళల్లో తమ హోటళ్లు, దుకాణాలను తెరిచి ఉంచారన్నారు. రాత్రి 10.30గంటల్లోగా వ్యాపార సముదాయాలు, హోటళ్లు, దుకాణాలను మూసివేయని వారిపై కఠిన చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు.

డయల్ 100 దుర్వినియోగం.. వ్యక్తికి జైలు శిక్ష

నవీపేట: తాగిన మైకంలో పదేపదే డయల్ 100కు కాల్‌చేసిన వ్యక్తికి న్యాయస్థానం రెండు రోజుల జైలు శిక్ష విధించింది. మండలంలోని బినోల గ్రామానికి చెందిన బోసి హన్మాండ్లు గత శుక్రవారం తాగిన మైకంలో 100 డయల్‌కు కాల్ చేశాడు. ఎస్సై వినయ్ ఆధ్వర్యంలో సిబ్బంది గ్రామానికి వెళ్లగా ఎటువంటి ఫిర్యాదు అందలేదు. దీంతో డయల్ 100ను దుర్వినియోగం చేసిన వినయ్‌పై కేసు నమోదు చేసి జిల్లా కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రెండు రోజుల జైలు శిక్ష విధించారు.

విద్యాశాఖ ఉద్యోగి 'రియల్' దందా

- అనధికార సెలవు.. ఆపై రియల్ ఎస్టేట్ వ్యాపారం
- ప్రతి నెలా పూర్తి వేతనం పొందుతున్న వైనం
- బోధనేతర ఉద్యోగి నిర్వాకం.. పట్టించుకోని ఉన్నతాధికారులు

నిజామాబాద్ అర్బన్: ప్రభుత్వం నుంచి ప్రతినెలా వచ్చే వేతనాన్ని జేబులో వేసుకుంటున్న విద్యాశాఖ ఉద్యోగి(బోధనేతర) విధులకు మాత్రం హాజరుకావడం లేదు. డ్యూటీకి డుమ్మాకొట్టి రియల్ ఎస్టేట్ వ్యాపారంలో మునిగి తేలుతున్నాడు. శాఖ అధికారులే అతడికి వత్తాసు పలుకుతున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

బదిలీ.. డిప్యుటేషన్.. అంతా ఆయన ఇష్టమే

విద్యాశాఖ పరిధిలో బోధనేతర ఉద్యోగి(జిల్లా పరిషత్ పరిధి) అయిన సదరు వ్యక్తి గతంలో కామారెడ్డి జిల్లాలో పని చేసి 317 జీవో ప్రకారం కమ్మర్‌పల్లి మండలంలోని శివారు గ్రామానికి బదిలీ అయ్యాడు. జిల్లా కేంద్రానికి ఆ గ్రామం దూరం కావడంతో కాంగ్రెస్ నాయకుడి సాయంతో డిప్యుటేషన్‌పై నిజామాబాద్ రూరల్ మండలానికి వచ్చి తిష్టవేశాడు. అంతకు ముందు మూడేళ్లపాటు అనధికారికంగా సెలవులో ఉంటూ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసిన అతడు, నిజామాబాద్ రూరల్ మండలానికి వచ్చి తొమ్మిది నెలలవుతున్నా ఇంత వరకు పాఠశాలకు వెళ్లలేదు. అనారోగ్యం పేరుతో ప్రధానోపాధ్యాయుడికి సెలవు దరఖాస్తును అందజేస్తున్నాడు. హెచ్‌ఎంకు నాలుగు నెలల వరకు సెలవు మంజూరు చేసే అధికారం ఉంటుంది. ఏడాది సెలవు కావాలంటే డీఈవో, ఆపై ఇంకా ఎక్కువ రోజులు కావాలంటే పాఠశాల డైరెక్టర్ అనుమతి అవసరం ఉంటుంది. దీంతో నాలుగు నెలల సెలవు కోసం హెచ్‌ఎంకు దరఖాస్తును అందజేస్తున్నాడు. ఇదేమిటని హెచ్‌ఎం సదరు ఉద్యోగిని ప్రశ్నిస్తే.. తనకు రాజకీయ అండదండలున్నాయని బెదిరిస్తూ రాజకీయ నాయకులతో ఫోన్ చేయిస్తున్నాడు. దీంతో హెచ్‌ఎం చేసేదేమీ లేక మౌనం ఉంటున్నట్లు తెలిసింది. హెచ్‌ఎం ఆమోదం లేకున్నా అనధికారికంగా సెలవు తీసుకుంటున్నాడు.

అండగా అధికారులు

బోధనేతర ఉద్యోగి ఏళ్ల తరబడి పాఠశాలకు వెళ్లకుండా డుమ్మాలు కొడుతుంటే సంబంధిత అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తి వ్యవహరిస్తున్నారు. హెచ్‌ఎంలు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా అతడిని వదిలేయండి అంటూ పేర్కొంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

సదరు బోధనేతర ఉద్యోగి జిల్లా కేంద్రంతోపాటు శివారు ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నట్లు సమాచారం. గతంలో ఐదో టౌన్ పీఎస్‌లో అతనిపై పలువురు బాధితులు ఫిర్యాదు చేశారు. న్యాల్‌కల్ శివారులోని ఓ భూమి విషయంలో మోసం చేయడంతో అతనిపై కేసు నమోదైంది. బాధితులు ఎవరైనా ఫిర్యాదు చేస్తే రాజకీయ నాయకులతో బెదిరింపులకు గురి చేయడం పోలీసులకు సిఫార్సు చేయించుకొని కేసుల నుంచి తప్పించుకోవడం కొనసాగుతోంది.

సాఫ్ట్‌బాల్ టోర్నీ విజేత మెదక్, మహబూబ్‌నగర్ జట్లు



బాలుర విభాగంలో విజేతగా నిలిచిన మెదక్ జట్టు



బాలికల విభాగంలో మహబూబ్‌నగర్ జట్టు..

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహించిన 68వ రాష్ట్ర స్కూల్ గేమ్స్ సాఫ్ట్‌బాల్ అండర్-17 బాలబాలికల టోర్నీలో మెదక్, మహబూబ్‌నగర్ జట్లు విజేతగా నిలిచాయి. సోమవారం నిర్వహించిన ముగింపు కార్యక్రమానికి జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి నాగమణి, ఎస్సై గోవింద్ హాజరై మాట్లాడారు.

విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని అన్నారు. టోర్నీలో ఉత్తమ ప్రతిభకనబర్చి ఎంపికైన క్రీడాకారులకు వచ్చే ఏడాది జనవరి 6 నుంచి 9వ తేదీ వరకు మహారాష్ట్రలోని జల్‌గావ్‌లో నిర్వహించనున్న జాతీయ స్థాయి పోటీల కోసం శిక్షణ శిబిరం నిర్వహిస్తామని నాగమణి తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం లక్ష్మీనర్సయ్య, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం ప్రధాన కార్యదర్శి బొజ్జ మల్లేశ్‌గౌడ్, జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మర్కంటి గంగామోహన్, శ్యాంసుందర్ శర్మ, శ్రీనివాస్, ఎం సుజాత, హాస్టల్ వార్డెన్‌లు షబానా బేగం, శైశీల తదితరులు పాల్గొన్నారు.

విజేతలు..

బాలుర విభాగంలో మొదటి స్థానంలో మెదక్, ద్వితీయ స్థానంలో నిజామాబాద్, తృతీయ స్థానంలో ఆదిలాబాద్ జట్లు నిలువగా, బాలికల విభాగంలో మొదటి స్థానంలో మహబూబ్‌నగర్, ద్వితీయ స్థానంలో నిజామాబాద్, తృతీయ స్థానంలో ఆదిలాబాద్ జట్లు నిలిచాయి.

అత్యా పత్య క్రీడా జిల్లా జట్ల ఎంపిక



ఎంపికైన బాలుర జట్టు



బాలికల జట్టు..

బాల్కొండ: సీఎం కప్‌లో పాల్గొనే అత్యా పత్య క్రీడా జిల్లా బాలుర, బాలికల అండర్-17 జట్లను సోమవారం మెండోరా మండలం పోచంపాడ్‌లోని తెలంగాణ బాలుర గురుకుల పాఠశాలలో ఎంపిక చేశారు. ఎంపికైన జట్లకు పాఠశాల ఆవరణలో మంగళవారం నుంచి శిక్షణ ఉంటుందని అత్యా పత్య క్రీడా అసోషియేషన్ ప్రతినిధులు తెలిపారు. ప్రధాన కార్యదర్శి ప్రదీప్, సంయుక్త కార్యదర్శి కీర్తన, ప్రిన్సిపాల్ సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బేస్‌బాల్‌లో తృతీయ స్థానం



డిచ్‌పల్లి: జగిత్యాల జిల్లాలో ఈ నెల 6 నుంచి 8వ తేదీ వరకు నిర్వహించిన రాష్ట్ర స్థాయి బేస్‌బాల్ టోర్నమెంట్‌లో నిజామాబాద్ జిల్లా బేస్‌బాల్ సీనియర్ మహిళల ఉత్తమ ప్రతిభకనబర్చి తృతీయ స్థానం సాధించినట్లు జిల్లా బేస్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎల్.మధుసూదన్‌రెడ్డి, సొప్పరి వినోద్ సోమవారం తెలిపారు. జట్టు సభ్యులను జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం ప్రధాన కార్యదర్శి మల్లేశ్‌గౌడ్, జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి మర్కంటి గంగామోహన్, సాఫ్ట్‌బాల్ అకాడమీ కోచ్ నరేశ్, మౌనిక, సీనియర్ క్రీడాకారిణి అర్చన, వ్యాయామ ఉపాధ్యాయురాలు జోత్స్న, శ్రీలత పాల్గొన్నారు.

తాగిన మైకంలో ఉరేసుకొని ఆత్మహత్య

నవీపేట: మండలంలోని శివతండాకు చెందిన గొండ బాబు(30) తాగిన మైకంలో సోమవారం తన ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై వినయ్ తెలిపారు. మద్యానికి బానిసైన బాబు తరచూ భార్య మమతతో గొడవపడేవాడని పేర్కొన్నారు. ఈనెల 5న తాగిన మైకంలో భార్యను కొట్టడంతో ఆమె పుట్టింటికి వెళ్లిపోయిందన్నారు. ఒంటరిగా ఇంట్లో ఉంటున్న బాబు తాగిన మైకంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మద్యానికి బానిసై వృద్ధుడు..

భిక్కనూరు: మండలంలోని కంచర్ల గ్రామానికి చెందిన వృద్ధుడు మద్యానికి బానిసై మతిస్థిమితం సరిగా లేక ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై సాయికుమార్ సోమవారం తెలిపారు. కలెట్ల ఎల్లయ్య (74) తన భార్య లక్ష్మితో కలిసి ఉంటున్నాడు. వారి పిల్లలు గతంలోనే మృతి చెందారు. మద్యానికి బానిసైన ఎల్లయ్య తరచూ భార్య లక్ష్మితో గొడవపడేవాడు. ఈనెల 6వ తేదీన కూడా భార్యతో గొడవ పడడంతో ఆమె హైదరాబాద్‌లో ఉంటున్న తన సోదరుడి వద్దకు వెళ్లిపోయింది.ఒంటరిగా ఉంటు న్న ఎల్లయ్య సోమవారం ఉదయం తన ఇంటి ఎదు ట ఉన్న జామ చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసు కున్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కెనాల్‌లో ట్రాక్టర్ బోల్తా



నిజామాబాద్ రూరల్: మోపాల్ మండలం చిన్నతాడెం గ్రామ శివారులోని కెనాల్‌లో ట్రాక్టర్ బోల్తా పడిన ఘటనలో ఇద్దరికి గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. న్యాల్‌కల్ నుంచి మోపాల్ మండల కేంద్రానికి వస్తున్న ట్రాక్టర్ చిన్నతాడెం గ్రామ శివారులోని కెనాల్ వంతెన పైనుంచి పడిపోయిందన్నారు. ఈ ఘటనలో పోతన్న, దశరథ్ అనే ఇద్దరికి గాయాలయ్యాయన్నారు.

ఇసుక డంప్ స్వాధీనం



రుద్రూర్: మండలంలోని రాయకూర్ శివారులోని గుట్ట ప్రాంతంలో అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంప్‌ను అధికారులు సోమవారం గుర్తించారు. పక్కా సమాచారం మేరకు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నజీరుద్దీన్ రెవెన్యూ సిబ్బందితో వెళ్లి ఇసుక డంప్‌ను పరిశీలించి సీజ్ చేశారు. సుమారు 22 ట్రాక్టర్ల ఇసుక ఉందని తెలిపారు. కోటగిరి, పొతంగల్ మండలాల్లో ఇసుక డంప్‌లను అక్కడి అధికారులు సీజ్ చేసి వేలం వేస్తుండడంతో అక్రమార్కులు గుట్టల వైపు దృష్టి సారించినట్లు తెలుస్తోంది.